క్లుప్తంగా

నేటి నుంచి జోనల్ క్రీడలు

చౌడేపల్లె: చిత్తూరు జిల్లా గ్రిగ్ మెమోరియల్ పుంగనూరు జోనల్ స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ఉదయం 9 గంటలకు తమ స్కూలు ఆవరణలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నట్లు విజయవాణి విద్యాసంస్థల కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర్ తెలిపారు. క్రీడలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనేతలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'మధ్యాహ్న భోజనం' తనిఖీ



సోమల: జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాలతో ఉండాలని, అలాగే విధిగా మెనూ పాటించాలని వైస్ ఎంపీపీ ప్రభాకర అన్నారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శివరత్నమ్మ ,హెచ్ఎం నాగరాజ పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో గ్రామ పంచాయతీ కార్యాయాలు..



శివాడి గ్రామ కంఠం మ్యాపును పరిశీలిస్తున్న డీపీఓ లక్ష్మి

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట, శివాడి, కొళత్తూరు గ్రామ పంచాయతీ కార్యాలయాలను గురువారం జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి తనిఖీ చేశారు.సిబ్బంది హాజరు పట్టికతో పాటు పలు రికార్డులు పరిశీలించారు. స్వామిత్వ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రాయలపేటలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈఓపీఆర్ఆర్డీ శారదా దేవి, పంచాయతీ కార్యదర్శులు పవన్‌కుమార్, గణపతి, జఫ్రుల్లా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ సామాజిక తనిఖీ

సోమల: మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్-2023లో రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేసినట్లు వ్యవసాయాధికారి సుధాకర్ గురువారం తెలిపారు. మొత్తం 3,396 మంది రైతులకు సంబంధించి 8,235 ఎకరాల పంట నమోదు చేశామని, ఈ జాబితాలను సామాజిక తనిఖీ కోసం ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 29 వరకు నోటీస్ బోర్డులో ఉంచనున్నట్లు చెప్పారు. స్థానిక సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రతి రైతు భరోసా కేంద్రంలో గ్రామ సభలు నిర్వహిస్తామని ,రైతులు ఈ లిస్ట్‌లో వారి వారి పేర్లు వేసిన పంట విస్తీర్ణం అన్ని పరిశీలించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏవైనా అభ్యంతరాలు ఉన్నపక్షంలో తమ సిబ్బంది దృష్టికి తేవాలన్నారు. వాటిని 30న ఏఓ, తహసీల్దార్ పరిశీలించి అభ్యంతరాలు సరైనవే అయితే బయోమెట్రిక్ వేసి, వాటిని పరిష్కరించి, ఆన్‌లైన్ చేస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోడల్ స్కూల్‌కు రూ.28.50 లక్షలతో సీసీ రోడ్డు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఈఈ

రొంపిచెర్ల: రొంపిచెర్ల మోడల్ స్కూల్‌కు తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారి నుంచి రూ.28.50 లక్షలతో సీసీ రోడ్డు వేస్తున్నట్లు సర్వ శిక్షా అభియాన్ ఈఈ మధుసూదన్ తెలిపారు. గురువారం మోడల్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల సౌకర్యార్థం ఈ రోడ్డును వేస్తున్నట్లు చెప్పారు. దీనికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారని, హాస్టల్ భవన నిర్మాణ పనులు పది రోజులలో పూర్తి చేసి అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్ బ్రహ్మానందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసై మృతి

పుంగనూరు: వ్యసనాలకు బానిసై ఓ వ్యక్తి మరణించిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం...పట్టణంలోని నక్కబండలో జయరాజ్(45) ఒంటరిగా నివసిస్తున్నాడు. కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం భార్య అతడిని వదిలి వెళ్లిపోయింది. పిల్లలు లేరు. ఒంటరిగా ఉండడంతో జయరాజ్ వ్యసనాలకు బానిసయ్యాడు. చివరకు అవే అతడి ఉసురు తీశాయి. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది శవానికి అంత్యక్రియలు నిర్వహించారు.

28న కంటి వైద్య శిబిరం

పుంగనూరు: ఈనెల 28న పట్టణంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి గురువారం తెలిపారు. చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ వైద్య బృందం వైద్య పరీక్షలు చేస్తుందని, కంటి జబ్బులు కలిగిన వారు పరీక్షలు చేసుకోవాలని కోరారు.

రాష్ట్రానికి జగన్ అవసరం

- ప్రతి గడపకూ వెళ్లి చాటిచెబుదాం
- మరోసారి ప్రజల మద్దతు పొందడమే ధ్యేయం
- కార్యాచరణపై పార్టీ నేతల దిశానిర్దేశం



పులిచెర్ల: మంగళంపేటలో మాట్లాడుతున్న కన్వీనర్ నాదమునిరెడ్డి



రొంపిచెర్ల: మోటుమల్లెల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి



చౌడేపల్లె: ఏ.కొత్తకోటలో సచివాలయ కన్వీనర్లకు బ్యాగ్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

చౌడేపల్లె: ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అందరూ కలిసి పనిచేద్దాం.. ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలో ప్రతి ఇంటి గడపకూ వెళ్లి చాటిచెప్పాలని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి పిలుపునిచ్చారు. గురువారం ఏ.కొత్తకోట, చారాల, శెట్టిపేట, దుర్గసముద్రం, ఆమినిగుంట, పందిళ్లపల్లె, గడ్డంవారిపల్లె, పరికిదొన గ్రామ పంచాయతీల్లో «వై ఏపీ నీడ్స్ జగన్»పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నేతలు ఇంటింటికీ వెళ్లి చేయాల్సిన కార్యాచరణపై మార్గదర్శనం చేశారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించి ప్రజలు మళ్లీ తమ మద్దతు జగన్‌మోహన్‌రెడ్డికు ఇచ్చేలా అభివృద్ధి, సంక్షేమాన్ని తెలియజేయాలని పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు కోరారు. అనంతరం నువ్వే మానమ్మకం జగన్ కరపత్రాలతో పాటు బ్యాగ్ కిట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సుధాకర్ రెడ్డి, నరసింహులు యాదవ్, సచివాలయ మండల కన్వీనర్ రుక్మిణమ్మ, అగస్త్యేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రామనారాయణరెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గోవిందయ్య, సర్పంచులు రిజ్వాన, విజయకుమారి, సరస్వతమ్మ, ఓబుల్‌రెడ్డి, సావిత్రమ్మ, కదిరప్ప, భాగ్యవతి, లక్ష్మీదేవమ్మ, ఎంపీటీసీలు శ్రీరాములు,నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

పథకాల లబ్ధిని ప్రజలకు వివరిద్దాం

పులిచెర్ల(కల్లూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్న పథకాలతో ఆయా వర్గాలు పొందిన లబ్ధిని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సి. నాదమునిరెడ్డి కోరారు. గురువారం మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలో «వై ఏపీ నీడ్స్ జగన్» కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్ మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్, జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు హేమసుందరరెడ్డి, ముర్వత్ బాషా, నాగరాజ ప్రసాద్, వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, సర్పంచులు రాణెమ్మ, వాసు, మధు, కో-ఆప్షన్ సభ్యులు సైపుల్లా, ఆనంద్, గోవిందరెడ్డి, రాజమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హామీలను నమ్మొద్దు

రొంపిచెర్ల: తెలుగుదేశం ఇస్తున్న ఎన్నికల హామీలను ప్రజలు నమ్మరాదని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం గానుగచింత, మోటుమల్లెల, పెద్దమల్లెల, చిచ్చిలివారిపల్లె గ్రామ సచివాలయల పరిధిలో «వై ఏపీ నీడ్స్ జగన్» కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గతంలో చంద్రబాబు వందల్లో హామీలు ఇచ్చి ఎన్నికలలో గెలిచిన తర్వాత వాటిని నెరవేర్చిన పాపానపోలేదని అందరికీ తెలుసని హామీలను ఉదహరించారు. చంద్రబాబు అధికారం కోసం వాగ్దానాలు చేయడం తప్పితే ఆచరణలో అమలు చేయడని గతంలో అధికారంలోకి వచ్చాక తన నిజస్వరూపాన్ని చాటుకున్నాడన్నారు. అందుకే ప్రజలను ఆయన్ను తిరస్కరించి జగన్‌కు పట్టం కట్టారన్నారు. ప్రజల ఆకాంక్షలకు మించి సీఎం జగన్ మోహన్‌రెడ్డి పనిచేశారని, ఇచ్చిన ఎన్నికల హామీలలో 99 శాతం నెరవేర్చారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాథరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, వైస్ ఎంపీపీలు విజయశేఖర్, నూలు రెడ్డెప్ప, సర్పంచులు హేమలత, జీవలత, నాగిరెడ్డి, రమణయ్య, అరుణమ్మ, సుధారాణి, నాయకులు ప్రేమానందం, కోటా వెంకటరమణ, శ్రీనాధనాయుడు, సురేంద్రనాయుడు, రామనారాయణరెడ్డి, రవీంద్ర, బాబు పాల్గొన్నారు.

'వై ఏపీ నీడ్స్ జగన్'ను జయప్రదం చేయండి

పుంగనూరు: దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్లిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరంగా తెలియజేయాలని రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం పిలుపునిచ్చారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంపై గురువారం మున్సిపాలిటీలో అవగాహన సదస్సును మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా నిర్వహించారు. నాగభూషణం మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ వెంకట మిథున్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు నియోజకవర్గంలో నవంబర్1 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలన్నారు. బుక్‌లెట్లు, ప్రశ్నావళితో ప్రతి ఇంటికీ వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు వెళ్లి ప్రజాభిప్రాయం సేకరించాలన్నారు. అనంతరం 'మా నమ్మకం నువ్వే జగన్...ఆంధ్రప్రదేశ్‌కు జగన్‌నే ఎందుకు కావాలి?' అనే కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో ముఖ్యఅతిథి నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి మాట్లాడారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, కన్వీనర్ వరదారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, పార్టీ పట్టణ అధ్యక్షుడు జయరాం, వైఎస్సార్ సీపీ నాయకులు ఆవుల అమరేంద్ర, రాజేష్, సురేష్, కిషోర్, కౌన్సిలర్లు కొండవీటి కాంతమ్మ, పూలత్యాగరాజు, నటరాజ, నరసింహులు, మనోహర్, రేష్మా, జెపి.యాదవ్, సాజిదాబేగం తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న అలీమ్‌బాషా, నాగభూషణం, జింకా వెంకటాచలపతి, నేతలు

29న తిరుపతిలో సభా శతజయంతి సంస్మరణ సభ

పలమనేరు: రాయలసీమ కథాసాహిత్యానికి ఆద్యుడు, ఉపాధ్యాయులు, పాత్రికేయులు, రైతు నాయకులు కే.సభా శతజయంతి సంస్మరణ సభను ఈనెల 29న ఆదివారం తిరుపతి బైరాగిపట్టెడలోని చాంబర్ ఆఫ్ కామర్స్‌లో తిరుపతి జిల్లా రచయితల సంఘ అధ్యక్షులు డాక్టర్ మన్నవ గంగాధర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు చిత్తూరు జిల్లా రచయితల సమాఖ్య సమన్వయకర్తలు పలమనేరు బాలాజి, సాకం నాగరాజు గురువారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. తెలుగు కథారచయితల వేదిక హైదరాబాద్ ప్రచురించిన 38మంది రచయితల కథా సంకలనం మా కథలు -2022ను సభాకు అంకితమిస్తూ నిర్వహించే ఈ పుస్తక పరిచయ సభలో డాక్టర్ మధురాంతకం నరేంద్ర, ఆర్‌సీ క్రిష్ణస్వామి రాజు, నెమిలేటి కిట్టన్న, ఆకుల మల్లేశ్వరావుతోపాటు ఉమ్మడి జిల్లాలోని కవులు, రచయితలు పాల్గొంటారని, సాహితీప్రియులు విజయవంతం చేయాలని కోరారు.

అండర్-14 వాలీబాల్ జట్ల ఎంపిక



వాలీబాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయ బృందం

చౌడేపల్లె: అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకర్గ స్థాయి వాలీబాల్ జట్టును ఎంపిక చేసినట్లు హెచ్ఎం వేణుగోపాల్ తెలిపారు. గురువారం ఏ.కొత్తకోట ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మండలస్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారుల్లో 15మంది చొప్పున బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. వీరు గంగాధర నెల్లూరు మండలం నెల్లేపల్లె ఉన్నత పాఠశాలలో ఈనెల 30న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. కార్యక్రమంలో పీడీలు నితిన్, చిన్నప్ప, శారద, ఆమని, మధురిమ, పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



చదరంగం ఆడుతున్న విద్యార్థులు

పుంగనూరు: పట్టణంలోని గురుకులం చెస్ క్లబ్ గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో చెస్ పోటీలు నిర్వహించింది. ఈ పోటీలలో కొత్తయిండ్లు పాఠశాలకు చెందిన బిందుప్రియ, అనీషా, వినయ్‌కుమార్ ప్రతిభ చాటారు. ఈనెల 28, 29లో భీమవరంలో నిర్వహించనున్న అంతర్జాతీయ ఫిడే టోర్నమెంటులో వీరు పాల్గొంటారని నిర్వాహకులు మణికంఠ తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచడంతో పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



రజని

పెద్దపంజాణి: మండలంలోని నేలపల్లె జెడ్పీ హైస్కూలు 9వ తరగతి విద్యార్థిని ఎం.రజని రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైందని హెచ్ఎం మోహనమ్మ గురువారం తెలిపారు. ఏర్పేడు మండలంలో నిర్వహించిన సెలెక్షన్స్‌లో ప్రతిభ చాటి జిల్లా జట్టుకు ఎంపికైందని చెప్పారు. రజనిని పీడీ తులసీరామి రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రూ.20కోట్లతో 230 పనులు

- మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్



నరసింహప్రసాద్

పుంగనూరు: మున్సిపాలిటీలోని 31 వార్డులలో రూ.20 కోట్లతో 230 పనులు చేయనున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ప్రత్యేకంగా మున్సిపాలిటీకి రూ.20 కోట్లను మంజూరు చేయించారని, ఈ నిధులతో పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ కాలువలు, వీధులు, పైపులైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో 115 రోడ్లు, 85 మురుగునీటి కాలువలు, 25 పైపులైన్లు, బోర్లు, మరో 5 పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే ప్రధాన వీధుల్లో తారురోడ్లు వేస్తామన్నారు. త్వరలోనే ఈ పనులకు టెండర్ల ప్రక్రియ ముగించి పనులకు పూనుకుంటామన్నారు. పట్టణంలోని విస్తరణ ప్రాంతాల్లో కూడా ఈ పనులు చేయనున్నట్టు చెప్పారు. ఆయా ప్రాంతాల్లో పనులను నాణ్యతా ప్రమాణాలతో కౌన్సిలర్లు పూర్తి చేయించాలని కోరారు.

రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు



బిందుసేద్యంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న పీడీ రమణారెడ్డి

శాంతిపురం: రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ప్రభుత్వం ఇస్తోందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఎంఐపీ పీడీ రమణారెడ్డి కోరారు. గురువారం కెనమాకులపల్లె పంచాయతీ గడ్దూరు వద్ద రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాల లోపు ఉన్న వారికి 70 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఇస్తామన్నారు. అవసరం ఉన్న రైతులు ఆధార్ కార్డు, 1బిలతో స్థానిక రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని కోరారు. బిందు సేద్యంతో తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో అధిక విస్తీర్ణంలో సాగు చేయవచ్చన్నారు. రసాయన ఎరువులు, కలుపు తీత ఖర్చులు తగ్గుతాయన్నారు. అనంతరం ఆయన కొలమడగు రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఐఓ సాయి శ్రీనివాసులు, వివిధ డ్రిప్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనులను పరిశీలించిన కేంద్ర బృందం



సదుం: చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న కేంద్ర జలశక్తి బృందం సభ్యులు,



సోమల: అమృత్ సరోవర్ చెరువు పనులను పరిశీలిస్తున్న కేంద్ర జలశక్తి బృందం

సదుం/సోమల: సదుం, సోమల మండలాల్లో వాటర్‌షెడ్ పనులను కేంద్ర జలశక్తి బృందం గురువారం పరిశీలించింది. తాటిగుంటపాలెం పంచాయతీలో, ఎస్.నడింపల్లె వద్ద ఏర్పాటు చేసిన అమృత్ సరోవర్ చెరువులను, ఇరికిపెంట వద్ద చెక్ డ్యామ్‌ను కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ సచీంద్ర కుమార్ పట్నాయక్, సైంటిస్ట్ సోమరేంద్రో సింగ్ పరిశీలించారు. రుతుపవనాల ముందు, తరువాత నీటి నిల్వలను అంచనా వేసేందుకే పరిశీలిస్తున్నట్టు వారు చెప్పారు. భూగర్భ జలాల మట్టం పెంపుపై నివేదిక సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ గంగాభవాని, వాటర్ షెడ్ అడిషనల్ పీడీ ఉమాదేవి, ఏపీడీలు సునీల్, శ్రీనివాసులు, ఏపీఓలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

- ఎమ్మెల్సీ భరత్



శాంతిపురం : మఠం శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: చిన్న పాటి జబ్బులకు కూడా వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఇంటి వద్దకే డాక్టర్లు వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. గురువారం మఠంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లు, వైద్య సిబ్బంది ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి వ్యాధులు ఉన్న వారి సమాచారం సేకరించారని, వీరికి అవసరమైన 13 రకాల వైద్య పరీక్షలను క్యాంపులో చేసి, ఆయా రిపోర్టులను స్పెషలిస్టులతో పరిశీలించి మందులను ఉచితంగా ఇస్తున్నారన్నారు.దీనిని ప్రజల నుంచి విశేష స్పందన వస్తుండడంతో ఇకపై ప్రతి ఆరు నెలలకు గ్రామాల్లో ఈ క్యాంపులను నిర్వహించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ప్రజారోగ్యానికి కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.

424మందికి వైద్యపరీక్షలు

కార్యక్రమంలో వైద్యులు వంశీకృష్ణ, ప్రసాద్, ఉషారాణి, సంజనారెడ్డి, కార్తిక్, గోపీచంద్ మొత్తం 221 మంది మహిళలతో సహా 424 మంది రోగులకు సేవలు అందించారు. సురక్ష ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరినాథరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణమూర్తి, స్థానిక సర్పంచ్ మురళి, ఎంపీటీసీ చంద్రప్ప, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

368 మందికి వైద్య పరీక్షలు

కుప్పం: మున్సిపాలిటీలోని డీకేపల్లె, మోడల్ కాలనీ సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మొత్తం 368మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో అధికులు షుగర్, బీపీతో బాధపడుతున్నట్టు వైద్యులు నిర్ధారించి ఉచితంగా మాత్రలు పంపిణీ చేశారు. తొలుత శిబిరాన్ని ఎమ్మెల్సీ భరత్ ప్రారంభించి మాట్లాడారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులను అందజేశారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కౌన్సిలర్లు హఫీజ్, వైద్యులు దిలీప్ కుమార్, సుభాష్ రాజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొంగనపల్లెలో 454 మందికి..

రామకుప్పం: మండలంలోని కొంగనపల్లెలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మొత్తం 454మందికి వైద్యాధికారులు లోకేష్, దీప, రాజ్‌కుమార్ నాయక్ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని పార్టీ మండల కన్వీనర్ బాబురెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈఓపీఆర్డీ రాధాకృష్ణ, సర్పంచులు సాలమ్మ, రాజా, ఆనంద్, ఎంపీటీసీ సౌందర్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సుగుణప్ప, నేతలు కృష్ణమూర్తి, అరవింద్, నాగరాజు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

సదుం: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుతాయని వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బూరగమందలో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. వైద్య సేవలపై డాక్టర్లతో చర్చించారు. శిబిరంలో మొత్తం 387 మందిని వైద్యబృందం పరీక్షించి మందులు అందజేసింది. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, డాక్టర్లు చరణ్, సుచిత, కిషోర్, అన్నపూర్ణ, సర్పంచులు వెంకటరమణ, జగన్నాథం , ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

తోటకనుమలో 417 మందికి..

వి.కోట: మండలంలోని తోటకనుమ గ్రామ పంచాయతీ జెడ్పీ హైస్కూలులో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మొత్తం 417మందికి వైద్య పరీక్షలు చేసినట్టు ఓగు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్ నాయక్ తెలిపారు. అలాగే 61మందికి కళ్ల పరీక్షలు చేసి కళ్లద్దాలను అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హరి, నాయకులు లోకేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వి.కోట: తోటకనుమలో వైద్య పరీక్షలకు హాజరైన ప్రజలు



శాంతిపురం : రోగులకు సురక్ష కిట్లను ఇస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు



రామకుప్పం : రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి దీప



సదుం: హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

31 నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'



నాయకులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: మండలంలో ఈనెల 31వ తేదీ నుంచి ఎమ్మెల్యే వెంకటేగౌడ నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ యువరాజు కోరారు. గురువారం మండలంలోని జవునపల్లె పంచాయతీ గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, 31 మంగళవారం, నవంబర్1 వ తేదీ బుధవారం జవునిపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారని, ప్రజలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులకు భరోసా

మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద వికలాంగులు గురువారం ఎంపీపీని, తహసీల్దార్ చిట్టిబాబును కలిశారు. సమస్యలను నివేదించారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారు. వారికి అవసరమైన వాటిని డిసెంబర్ 3న పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.



వికలాంగులతో చర్చిస్తున్న ఎంపీపీ